శిథిలావస్థలో కాలిబాట వంతెనలు

- పెరుగుతున్న ప్రజా రవాణా, తగ్గుతున్న సౌకర్యాలు
- కనీస మరమ్మతులు చేపట్టని అధికారులు

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలో నరసాపురం, నిడదవోలు కెనాల్‌పై మూడు కాలిబాట వంతెనలు ఉన్నాయి. కాలువకు అవతల మావుళ్లమ్మపేట, బ్రహ్మానందరెడ్డి కాలని ప్రజలకు, రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులకు, పాలకొల్లు రూరల్ పంచాయతీ నాగరాజు పేట, సాయినగర్ కాలనీ, వడ్లవానిపాలెం, వేడంగి పాలెం ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి వెళ్లే ప్రజలకు ఈ మూడు వంతెనలు చాలా ముఖ్యమైనవి. ఈ మూడు వంతెనలు గాంధీబొమ్మల సెంటర్ వద్ద గల దాసరి నారాయణ రావు కాలిబాట వంతెన, ఎర్ర వంతెన, బ్రాడీపేట బైపాస్ రోడ్డు వంతెనలు నడిచి వెళ్లడానికి, మోటర్ వాహనాలకు అనుకూలంగా ఉన్నాయి. భారీ వాహనాలు రావాలంటే లాకుల వద్ద గల వంతెనలే ప్రధాన రహదారులు. ఈ మూడు వంతెనల్లో ఎర్ర వంతెన నడిచి వెళ్లడానికి మాత్రమే ఉపయోగపడుతుంది. ఈ వంతెనను 1951లో నిర్మించారు. అలాగే 1994లో నిర్మించిన బ్రాడీపేట, నాగరాజుపేట వంతెన అప్పుడే శిథిలావస్థకు చేరుకుంది. జనాభా పెరగడంతో ఈ వంతెనలపై ద్విచక్ర వాహనాల రద్దీ బాగా పెరిగింది. ప్రస్తుతం దాసరి నారాయణరావు వంతెన ఒక్కటే అనుకూలంగా ఉండగా ఈ రెండు వంతెనలు మాత్రం ప్రమాదకరంగా ఉండడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అత్యవసరమైతే ఈ ప్రమాదకరమైన వంతెనలపైనే ప్రయాణం చేయాల్సి వస్తుంది. ఎర్రవంతెన నిర్మించి, 70 సంవత్సరాలు కావస్తుంది. కాని నేడు నడవడానికి కూడా అనుకూలంగా లేని దుస్థితిలో ఉంది. బ్రాడీపేటలో నిర్మించిన వంతెన 30 ఏళ్లకే శిథిలావస్థకు చేరుకుంది. సైడ్ రెయిలింగ్ ఊడిపోయి అత్యంత ప్రమాదకరంగా ఉన్నాయి. ఆదమరిచినా, రాత్రి సమయంలో లైట్లు లేకపోయినా ప్రమాదాలకు నిలయంగా ఈ వంతెన ఉండడం ప్రజలను భయాందోళనకు గురి చేస్తుంది. ఈ వంతెనకు మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.


వంతెనకు మధ్యలో సైడ్ వాల్ దుస్థితి


శిథిలావస్థలో ప్రమాదకరంగా ఎర్రవంతెన

వంతెనల నిర్మాణం

1946లో నరసాపురం కెనాల్ ఫుట్ బ్రిడ్జి (ఎర్రవంతెన) నిర్మాణానికి అప్పటి మున్సిపల్ చైర్మన్ బీవీ సుబ్బారావు ఫౌండేషన్ వేయగా, 1951లో అప్పటి మద్రాసు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఏబీ శెట్టి, మున్సిపల్ చైర్మన్ ఆచంట పెదగోపాలం ఆధ్వర్యంలో ఈ వంతెనను ప్రారంభించారు. ఈ వంతెన శిథిలావస్థలో ఉండగా ఓఎన్‌జీసీ సౌజన్యంతో 1993లో మరమ్మతులు చేశారు. 1994లో పంచాయితీరాజ్ శాఖ నిధులతో బ్రాడీపేట బైపాస్ వద్ద కాలిబాట వంతెనను నిర్మాణం చేశారు. స్థానిక గాంధీబొమ్మల సెంటర్ నందు నిర్మించిన కాలిబాట వంతెనను 2003లో రాజ్యసభ సభ్యులు దాసరి నారాయణరావు రాజ్యసభ నిధులతో కాలిబాట వంతెన నిర్మించారు.

ప్రశ్నార్థకంగా వంతెనల పరిధి

పట్టణంలో బ్రాడీపేట బైపాస్ రోడ్డు వద్ద గల నాగరాజు పేట కాలిబాట వంతెన అత్యంత ప్రమాదకరంగా ఉంది. కాలువ అవతల రూరల్ పంచాయతీ, ఇటు వైపు మున్సిపల్ పరిధిలో ఈ వంతెన 1994లో పంచాయతీరాజ్ శాఖ అధికారులు నిర్మించారు. దీని మెయింటినెన్స్ మాత్రం ఎవరు చేస్తున్నారనేది ప్రశ్నార్థకంగా ఉంది. ప్రస్తుతం ప్రమాదకరంగా ఉన్న ఈ వంతెన మరమ్మతుల నిమిత్తం గతంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మున్సిపల్ శాఖ అధికారులను సంప్రదించగా మా పరిధిలో లేదంటే మా పరిధిలో లేదని చెప్పడం గమనార్హం. పంచాయితీ రాజ్ శాఖ అధికారులు నిర్మాణం మాత్రమే మా పరిధిలో ఉందని తద్వారా తాము నిర్మించామని చెబుతున్నారు. మున్సిపల్ అధికారులను ప్రశ్నిస్తే అది పంచాయతీరాజ్ అధికారులు నిర్మించారని, తమకు అప్పగించలేదని, వ్రాత పూర్వకంగా ఆ వంతెన అప్పగిస్తే మరమ్మతులు చేయిస్తామని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, ఈ వంతెన ఏ డిపార్ట్‌మెంట్ పరిధిలో ఉందో గ్రహించి ఆ డిపార్ట్‌మెంట్ అధికారులతో వేగవంతంగా మరమ్మతులు చేయించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

వంతెన ప్రమాదకరంగా ఉంది



పట్టణంలోకి రావాలంటే నిత్యం మాకు ఇదే మార్గం. ఈ మూడు వంతెనల్లో ఏదో ఒకదానిపై ప్రయాణం చేయాల్సిందే. మాది నాగరాజు పేట మాకు దగ్గర్లో బ్రాడీపేట వంతెనే సులువైన మార్గం. ఈ వంతెన చాలా ప్రమాదకరంగా ఉంది. గతంలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న ఓ ఫ్యామిలీ వంతెనపై నుంచి ఫుట్‌పాత్‌పై పడిపోయిన సంఘటనలు ఉన్నాయి. వంతెన నిర్మించి, 30 సంవత్సరాలు కావొస్తుంది. కాని గత పదేళ్లుగా ఈ వంతెన శిథిలావస్థలోనే ఉంది. పట్టించుకునే నాధుడే లేడు.న

వీరా నరసింహరావు, నాగరాజుపేట, పాలకొల్లు

ఇదే దగ్గరి మార్గం



ఈ వంతెన ముఖ్యంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థులకు, పాలకొల్లు బ్రాడీపేట, పార్వతి నగర్ ప్రాంతాలతో పాటు పోడూరు మండలం నుంచి వచ్చే ప్రజలకు రైల్వే స్టేషన్‌కు వెళ్లడానికి ఇదే దగ్గరి మార్గం. ప్రధానంగా విద్యార్థులు ఈ వంతెనపై వెళ్లేటప్పుడు చాలా ప్రమాదకరంగా ఉంటుంది. సైడ్ వాల్‌లు లేకపోవడం ఏదైనా ప్రమాదం జరిగితే పిల్లల పరిస్థితి ఏమిటని ఆందోళన కలుగుతుంది. ఇప్పటికే పలు పర్యాయాలు అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. దయచేసి ఈ వంతెనపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించి, మరమ్మతులు చేయించాలని కోరుకుంటున్నాం.

అంబటి గిరి, మాజీ వార్డు మెంబర్, పాలకొల్లు రూరల్ పంచాయతీ

వరములివ్వు బొజ్జ గణపయ్య

నరసాపురం: వినాయకచవితి నవరాత్రి ఉత్సవాలు పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని పలు ప్రాంతాల్లో భారీగా వినాయక మండపాలు ఏర్పాటు చేసి, చవితి పూజలు ప్రారంభించారు. గతంతో పోలిస్తే ఈ ఏడాది పలు సెంటర్లలో కొత్తగా మండపాలు ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తున్నారు. మండపాల వద్ద విద్యుత్ అలంకరణలు ఆకట్టుకున్నాయి. అయితే ఆదివారం ఉదయం నుంచి కురిసిన వర్షం భక్తులను కొంత ఇబ్బంది పెట్టింది.


పాలకొల్లు సెంట్రల్: వినాయకచవితి సందర్భంగా శనివారం పట్టణంలో గణపతి నవరాత్రుల ఉత్సవాలు అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలో బంగారపు కొట్లు సెంటర్, కొండాలమ్మ గుడి, సుబ్బారాయుడు గుడి, దేవునితోట, చిత్రావిచెరువు గట్టు, బుధవారపు వీధి, తదితర సెంటర్‌లలో ఐదు నుంచి పదిహేను అడుగుల ఎత్తు వరకు విగ్రహాలను ఏర్పాటు చేసి, పూజలు ప్రారంభించారు. క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో గణపతి పూజ చేశారు.

మొగల్తూరు: వినాయకుడి చవితి ఉత్సవాలు మండలంలోని పలు గ్రామాల ప్రజలు శనివారం ఘనంగా నిర్వహించారు. మొగల్తూరులోని ప్యాసింజర్స్, ట్రక్కు ఆటో యూనియన్ ఆధ్వర్యంలో గాంధీ బొమ్మల సెంటర్‌లో వినాయకుడి విగ్రహం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయకుని ఊరేగింపులు

వినాయక చవితిని పురస్కరించుకొని పలు గ్రామాల్లో ఆలయాలు, ప్రధాన కూడళ్లలో నెలకొలిపిన వినాయకుడి విగ్రహాలకు పూజలు ఘనంగా నిర్వహించారు. పేటపల్లంలో నిలబెట్టిన వినాయకుణ్ణి రెండో రోజు ఆదివారం నిర్వహించిన ఊరేగింపులో యువతీ యువకులు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన వేలంలో 9 కేజీల లడ్డూను నాగేశ్వర జ్యూయలర్స్ అధినేత జవ్వాది నాగేశ్వరరావు రూ.6 వేలకు దక్కించుకున్నాడు.


పెనుమంత్ర: పూజలో పాల్గొన్న భక్తులు


నరసాపురం: రాయిపేటలో పుంతలో ముసలమ్మ ఆలయం వద్ద ఏర్పాటు చేసిన విగ్రహం

యలమంచిలి: వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ప్రతీ గ్రామంలోనూ చలువ పందిళ్లు వేసి, వినాయకుడి ప్రతిమలు ఏర్పాటు చేశారు. రాత్రి సమయంలో భజనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తొమ్మిది రోజులు నిర్వహించే వేడులకు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

పెనుమంత్ర: గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ గణపతి ఆలయంలో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణపతి విగ్రహానికి రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు, రాధాదేవి, మారుముఖం శ్రీనివాస్, నాగమణి, దంపతులు విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీలక్ష్మీగణపతిస్వామివారి ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు నల్లమిల్లి గోపిరెడ్డి, తుంపూడి విజయ్‌కుమార్, జంపాల శ్రీనివాసరాజు, తాడి వీరవెంకటరెడ్డి, అరటికట్ల సత్యనారాయణ, ఐటీఐ రాంబాబు, రాగురాము, కర్రి నాగిరెడ్డి, ఇసుకపల్లి రంగరాజు, తుంపూడి చంటి పాల్గొన్నారు.

పెనుగొండ: సిద్ధాంతం తానేష్ శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో చవితి ఉత్సవాలు 50 ఏళ్లు పూర్తి కావడంతో నిమజ్జనోత్సవం వేడుకగా నిర్వహించారు. చవితి పూజల అనంతరం ప్రత్యేక పూల రథంపై గణేష్‌కు గ్రామోత్సవం నిర్వహించారు. సుమారు 30 వాహనాలపై చిన్నారులను దేవతా మూర్తుల అలంకరణలు ఆకట్టుకొన్నాయి.

చలువ పందిళ్లలో చవితి గణనాథులు

ఆచంట నియోజకవర్గంలో చవితి గణనాథులు కొలువు తీరారు. పెనుగొండ, ఆచంట మండలాల్లో వాడవాడలా చవితి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వడలిలో మూషికా వాహనంపై గణేషుడి గ్రామోత్సవం నిర్వహించారు.

నరసాపురం రూరల్: వినాయకచవితిని శనివారం ప్రజలు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పలు గ్రామాల కూడళ్లలో వినాయకుడి విగ్రహాలను ప్రతిష్టించి పూజలు నిర్వహించారు. కొన్ని ప్రాంతాల్లో వినాయకుడికి ఒక రోజు ఉత్సవాలు చేసి, వినాయకుడిని ఊరేగించి, నిమజ్జనం చేశారు. నరసాపురం మండలంలో అన్ని గ్రామాల్లో గణేశుడి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. గ్రామాలలోని విఘ్నేశ్వరుడి ఆలయాలను, చలువ పందిళ్లను విద్యుద్దీపాలంకరణలతో అందంగా తీర్చిదిద్దారు. చిట్టవరం ప్రాంతంలో ఏర్పాటు చేసిన గణేష్‌విగ్రహానికి గ్రామానికి చెందిన పైడికొండల గోపాలకృష్ణ, విజయలక్ష్మి దంపతులు, పోలిశెట్టి సత్యనారాయణస్వామి (బాబి), రమ్య దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.


మొగల్తూరు: వినాయకుడి ఊరేగింపులో పాల్గొన్న యువతీ యువకులు


పెనుగొండ: సిద్ధాంతంలో దేవతా మూర్తుల అలంకరణలో చిన్నారులు


పాలకొల్లు సెంట్రల్: అచ్చుగట్లపాలెంలో పూజలందుకుంటున్న గణనాథుడు


నరసాపురం రూరల్: చిట్టవరంలో ఏర్పాటు చేసిన గణేష్ విగ్రహం

పొంచి ఉన్న ముప్పు


కొత్త నవరసపురం ఎస్టీ కాలనీలోకి చేరిన వరద నీటిని పరిశీలిస్తున్న వీఆర్వో సత్యనారాయణ

నరసాపురం రూరల్: నరసాపురం మండలంలో గోదావరి వరద ఉధృతి ఆదివారం ఉదయం నుంచి పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు చేరడంతో నరసాపురం మండంలోని పాతనవరసపురం, కొత్తనవరసపురం, ఎస్టీ కాలనీల్లో పల్లపు ప్రాంతాలు, నరసాపురం పట్టణంలోని ఒకటో వార్డు లాకుపేట వద్ద లోతట్టు ప్రాంతాల్లోకి ఆదివారం వరదనీరు చేరుతుంది. ఆయా ప్రాంతాల్లో రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది నిత్యం గస్తీ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ రాజరాజేశ్వరి నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వరద ఉధృతి మరింత పెరిగితే తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి తహసీల్దార్ సూచించారు.

కుండపోత వర్షంతో ఇక్కట్లు


రహదారులపై నిలిచిన వర్షపు నీరు

పెనుగొండ: అల్పపీడన ప్రభావంతో ఆదివారం ఉదయం నుంచి ఆచంట నియోజకవర్గంలో కుండపోతగా వర్షం కురుస్తూనే ఉంది. చినుకు.. చినుకూ పడుతూనే ఉండడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. 15 రోజులుగా ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. పనులన్నీ నిలిచిపోవడంతో జీవనోపాధి కష్టసాధ్యంగా ఉందంటూ పేద వర్గాలు ఆవేదన చెందుతున్నారు. వారం రోజులుగా పనులు లేవంటూ వాపోయారు. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు రహదారులు జలమయమయ్యాయి. దీంతో డ్రైనేజీల్లో బురద నీరు రోడ్లపై ప్రవహిస్తుంది.

అన్నదాతకు వాయు గండం

పెనుగొండ: అన్నదాతకు మరోసారి గుండె గుబేలు మంటుంది. ఇప్పటికే ఈ సీజన్‌లో మూడోసారి భారీ వర్షాలు కురుస్తుండడంతో వాయు గుండాలు రైతుల పాలిట గండంగా మారాయి. రెండు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకే ఆచంట వేమవరంలో వరి చేలు నీట మునిగాయి. ఇపుడు మరోసారి మూడు రోజులు భారీ వర్షాల హెచ్చరికలతో రైతుల్లో కలవరం మొదలైంది. ఇప్పటికే జూలైలో కురిసిన భారీ వర్షాలతో ముఖ్యంగా నక్కల డ్రెయిన్ ప్రాంతంలో రైతన్నలు తీవ్రంగా నష్టపోయారు. ఆచంట వేమవరంలో రోజుల తరబడి వరి చేలల్లో నీరు నిలిచి పోవడంతో ఆకుమడులు పూర్తిగా కుళ్లిపోయాయి. నాట్లు వేసిన వరి చేలు కుళ్లిపోవడంతో వరి నారు బయటి నుంచి తెచ్చుకొని రెండో సారి ఊడ్చారు. దీంతో ఒక్కో రైతుకు ఎకరాకు రూ.15 వేల వరకూ అదనపు ఖర్చు అయింది. వైఎస్సార్ ప్రభుత్వంలో బీమా సకాలంలో చేతికి అందడంతో రైతులకు నష్టం లేకుండా ఉండేది. అయితే, ఇప్పటి వరకూ భీమాపై కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడంతో రైతులు దిక్కు తోచని పరిస్థితిలో ఉన్నారు. జూలైలో భారీ వర్షాలు, వరదలకు నష్టపోయిన రైతన్నలకు బీమా ఎప్పటికి వస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది.

రెండు రోజులుగా వర్షపు నీటిలోనే

ఆచంట మండలం ఆచంట వేమవరంలోని వరి చేలు రెండు రోజులుగా వర్షపు నీటిలోనే మునిగి ఉన్నాయి. అల్ప పీడనంతో మరో మూడు రోజులు వర్షం కురిసే అవకాశం ఉండడంతో వరి చేలు పూర్తిగా కుళ్లిపోతాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక సాగు కష్టమేనంటూ వాపోతున్నారు. వర్షాలు ఇలా కురుస్తూ ఉంటే దిగుబడులపై ప్రభావం చూపే అవకాశం ఉందంటూ ఆందోళన చెందుతున్నారు.


ఆచంట వేమవరంలో మునుగుతున్న వరిచేలు

శాశ్వత పరిష్కారం చూపాలి



ప్రతీ ఏటా వర్షాకాలంలో నక్కల డ్రెయిన్ ఉధృతితో ఆచంట వేమవరంలో రైతన్నలు తీవ్రంగా నష్టపోతున్నారు. రెండు, మూడు సార్లు నాట్లు వేసుకోవలసిన పరిస్థితి ఏర్పడుతుంది. రైతులను ఆదుకోవడానికి శాశ్వత పరిష్కారం చూపాలి

జక్కంశెట్టి చంటి, సర్పంచ్, ఆచంట వేమవరం

స్థిరంగా గోదావరి ప్రవాహం


వలందర్‌రేవు వద్ద గోదావరి ప్రవాహ దృశ్యం

నరసాపురం: వశిష్ట గోదావరి ప్రవాహం స్థిరంగా కొనసాగుతుంది. ఇంకా నీటిమట్టం సాధారణ స్థితికి చేరుకోలేదు. దీంతో గోదావరి పరివాహక ప్రజలు ఆందోళన చెందుతున్నారు. భద్రాచలంలో నీటిమట్టం తగ్గుతూ ఉండటంతో ఎగువ ప్రాంతాల నుంచి వశిష్ట గోదావరిలోకి నీరు భారీగా వచ్చి చేరుతుంది. భారీగా వస్తున్న నీరు సముద్రంలో కలుస్తుంది. అయితే సముద్రం పోటు సమయంలో నీరు నిలిచిపోవడంతో స్థానికంగా నీటిమట్టం పెరుగుతుంది. ఎగువ ప్రాంతాల నుంచి సముద్రంలో కలవడానికి నీరు వస్తూ ఉన్నంత వరకూ స్థానికంగా నీటిమట్టం పెరుగుతూనే ఉంటుంది. వలందర్ రేవులో స్నానాల రేవు వద్ద ప్రమాదకర స్థితిలో నీటి ప్రవాహం ఉంది. మాధవాయిపాలెం రేవులో పంటు రాకపోకలు ఆదివారం కూడా కొనసాగించలేదు. పై ప్రాంతాల్లో వరద తీవ్రత తగ్గినా మరో రెండు మూడు రోజులు నరసాపురంలో గోదావరి ఉధృతి అలాగే ఉంటుంది.

తగ్గుముఖం పట్టిన గోదావరి

యలమంచిలి: అధిక వర్షాల వలన గోదావరికి వరద రావడంతో మూడు రోజులుగా కనకాయలంక వద్ద కాజ్‌వే నీట మునిగింది. దీంతో కనకాయలంక ప్రజల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా అధికారులు ఇంజన్ పడవలు ఏర్పాటు చేశారు. గోదావరిలో వరద ఆదివారం సాయంత్రం నుంచి తగ్గుముఖం పట్టింది. ఈ విధంగా గోదావరిలో నీరు తగ్గితే సోమవారం సాయంత్రానికి కాజ్‌వే వరద నుంచి బయటపడొచ్చని, అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఎడతెరపి లేకుండా ఆదివారం వర్షం కురవడంతో ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. గ్రామంలో వైద్య శిబిరాలు కొనసాగుతున్నాయి.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు

ఉండి: వినాయక చవితి పండుగను పురస్కరించుకుని గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎండీ నసీరుల్లా ఆదివారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.

క్లుప్తంగా

సహాయక చర్యల్లో ప్రభుత్వం విఫలం


జెడ్పీటీసీ నడపన

పాలకొల్లు అర్బన్: విజయవాడ వరద నీటిలో మునిగిపోవడానికి చంద్రబాబు వైఫల్యమే కారణమని జెడ్పీటీసీ నడపన గోవిందరాజుల నాయుడు విమర్శించారు. ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. బాధితులకు సహాయక చర్యలు చేపట్టడంలోనూ అధికార యంత్రాంగం తప్పిదం కనిపిస్తోందన్నారు. కనీసం ముందస్తు హెచ్చరికలు కూడా చేయలేదన్నారు. బుడమేరు కారణంగా విజయవాడకు ముప్పు ఏర్పడుతుందని అధికారులకు, చంద్రబాబుకు తెలుసునని, అయినా వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించలేకపోయారన్నారు. వరద ముంపు కారణంగా 50 మందికి పైగా మృత్యువాత పడ్డారని, అనేక మంది బాధితులు ఆకలితో అలమటిస్తున్నారని దుయ్యబట్టారు. అలాగే ప్రతీ నెలా రేషన్ సరుకులు అందించే వాహనాలను సైతం నిలుపుదల చేశారని, ప్రస్తుతం అవే వాహనాలు వరద బాధితులకు ఆహార పొట్లాలు అందించేందుకు ఉపయోగపడుతున్నాయన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందస్తు ఆలోచనలతో పాలన సాగించేవారన్నారు. వలంటీర్ వ్యవస్థ కరోనా సమయంలోనూ, వరద ప్రభావిత ప్రాంతాల్లో విశేష సేవలందించి, దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందారని జెడ్పీటీసీ గోవింరాజుల నాయుడు గుర్తు చేశారు.

ముత్యాలమ్మ దర్శనానికి భారీగా భక్తులు


ముత్యాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

మొగల్తూరు: తీర ప్రాంత గ్రామాల్లో ప్రసిద్ధి చెందిన బంది ముత్యాలమ్మ అమ్మవారిని దర్శించుకునేందుకు ఆదివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఉదయం నుంచి వర్షం పడుతున్నా భక్తులు భారీగా తరలి వచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ చైర్మన్ కడలి మాణిక్యాలరావు, సభ్యులు, భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈవో డి.రామకృష్ణంరాజు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

నరసాపురం: పట్టణంలోని శ్రీహరిపేటలో నిర్మాణంలో ఉన్న ఆంజనేయస్వామి విగ్రహం ప్రాంతంలో నలుగురు గుర్తు తెలియని దుండగులు తనపై దౌర్జన్యం చేసి, గాయపరిచి తన వద్ద ఉన్న రూ.4 వేలు లాక్కున్నారని, 22వ వార్డు కొత్తకాలనీకి చెందిన కారాడి చిన్ని ఆదివారం పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనికి సంబంధించి టౌన్ ఎస్సై జయలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మద్యం అలవాటు ఉన్న చిన్ని ఈ నెల 4వ తేదీన ఏటిగట్టు పైన మద్యం దుకాణం వద్ద ఉండగా అక్కడికి రెండు బైక్‌లపై నలుగురు గుర్తు తెలియని దుండగులు వచ్చి చిన్నిని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ గొడవ పడ్డారు. తరువాత అతనిని వెంబడించి వీర భవానీ ఆలయం వద్దకు వచ్చే సరికి కొట్టి జేబులో ఉన్న సొమ్ము తీసుకొని పారిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు ఎస్సై వివరించారు.

వరద బాధితులకు సహాయం

మొగల్తూరు: విజయవాడ వరద బాధితులకు తమ వంతుగా రూ.50 లక్షల చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాష్ట్ర వాటర్ వర్క్స్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ సభ్యుల తరపున అందించినట్లు మొగల్తూరు మండలం కొత్తపాలెం కాంట్రాక్టర్ లోకం నాని ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడ వరద బాధితులకు తాను ఇప్పటికే రూ.1 లక్ష అందించానన్నారు. గ్రామస్తులు అందించిన రూ.60 వేలలో రూ.10 వేలు తాను ఇచ్చిన లక్షకు కలిపి మొత్తం లక్షా పదివేలు డీడీని సీఎం సహాయ నిధికి ఇచ్చామన్నారు. మిగిలిన రూ.50 వేలు ఎమ్మెల్యే నాయకర్ వరద బాధితులకు సేకరించిన సహాయం నిమిత్తం అందించామని పేర్కొన్నారు.

బస్‌పాస్‌ల పంపిణీ

తణుకు అర్బన్: ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా బస్‌పాస్‌లు అందించేందుకు దాతలు ముందుకు రావడం అభినందనీయమని తణుకు ఆర్టీసీ డిపో మేనేజరు సప్పా గిరిధర్ కుమార్ అన్నారు. తణుకు స్వర్ణ లయన్స్ క్లబ్ జోన్ చైర్‌పర్సన్ చిట్టూరి సుజాత ఆర్థిక సాయంతో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూల్, ఏకేటీపీ హైస్కూల్‌కు చెందిన 200 మంది విద్యార్థులకు శనివారం ఉచిత బస్‌పాస్‌లు అందజేశారు. దూరప్రాంతాల విద్యార్థులకు ఉచిత బస్‌పాస్‌లు ఉపయోగకరంగా ఉంటున్నాయని స్పష్టం చేశారు. స్వర్ణ లయన్స్ క్లబ్ సభ్యులు, డిపో సూపరింటెండెంట్ బీవీకే రావు, ములగాల వెంకటరత్నం పాల్గొన్నారు.